ప్రజాశక్తి
శుక్రవారం 23 డిసెంబర్ 2022 5
అనంతపురం



'ఆమెకు న్యాయం జరిగింది'..!

◆ ఫలించిన 10 ఏళ్ల నిరీక్షణ

◆ వేతనం చెల్లింపుతో పాటు.. ఉద్యోగం కల్పిస్తూ చర్యలు

◆ కలెక్టర్, డిపిఒ ప్రత్యేక చొరవ ◆ అధికారుల 'స్పందన'పై పలువురి హర్షం



సులోచన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

భర్త మరణించాడు.. అనంతరం భర్త ఉద్యోగంలో ఆమె చేరింది. ఉద్యోగంలో చేరింది కానీ ఆమెకు వేతనం ఇవ్వలేదు.. ఉద్యోగ భద్రతా కల్పించలేదు. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 10 ఏళ్ల పాటు ఆమె వేతనం లేకుండా వెట్టిచాకిరీ చేసింది. తన సమస్యను గత దశాబ్ధకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద గోడువెళ్లబోసుకుంటూనే ఉన్నా, ఎవరూ పట్టించుకోలేదు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఆమె న్యాయపోరాటం కొనసాగించింది. ఈ పోరాటంలో ఎట్టకేలకు విజయం సాధించింది. ఆమె పని చేసిన రోజులకు వేతనం, ఇతర అన్ని సదుపాయాలనూ కల్పిస్తూ జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. అలుపెరగకుండా 10 ఏళ్ల పోరాటం సఫలీకృతం కావడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. పోరాడి సాధించుకున్న ఓ మహిళ జీవితంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

10 ఏళ్ల పాటు వేతనం కోసం పోరుసాగించిన ఆ మహిళ పేరు సులోచన. ఆమె కుటుంబంతో కలిసి గుత్తి పట్టణంలో నివసించేది. భర్త ముత్యాలు గుత్తి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పని చేసేవాడు. అనారోగ్యంతో 2011లో మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో అతని భార్య సులోచనకు గుత్తి మున్సిపాల్టీలో స్వీపర్‌గా అప్పటి మున్సిపల్ కమిషనర్ 2012లో ఉద్యోగం కల్పించారు. గుత్తి పంచాయతీగా ఉన్న సమయంలో భర్త మరణించాడు. తరువాత గుత్తి మున్సిపాల్టీగా మారింది. ఈ సమయంలో మున్సిపాల్టీలోనే సులోచనకు ఉద్యోగం ఇచ్చారు. ఆమె ఉద్యోగంలో అయితే చేరింది కానీ వేతనం మాత్రం ఇవ్వలేదు. ఏ రోజుకైనా వేతనాలు వస్తాయని ఆశించి ఆమె ఆదే కార్యాలయంలో పని చేస్తూనే వచ్చింది. ఇలా రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా వేతనం రాలేదు. వేతనం ఇప్పించాలంటూ కన్పించిన ఉన్నతాధికారులు అందరికీ వినతులు అందజేస్తూనే ఉంది. చాలా మంది కలెక్టర్లకు సైతం వినతిపత్రం అందజేసింది. ఎవరూ ఆమె సమస్యను తీర్చలేదు. చేసేది లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తనకు న్యాయం చేయాలంటూ హైకోర్టుకు వెళ్లింది. ఆమె వాదన విన్న హైకోర్టు బాధితురాలికి న్యాయం చేయాలని తీర్పును ఇచ్చింది. కోర్టు తీర్పును అమలు చేయడంలో కూడా జాప్యం జరుగుతూనే ఉంది.

కలెక్టర్ నాగలక్ష్మి 'స్పందన'... డిపిఒ చొరవ..

అధికారులకు వినతిపత్రాలు ఇచ్చే క్రమంలో భాగంగా బాధితురాలు సులోచన ఇటీవల అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని 'స్పందన' గ్రీవెన్స్‌సెల్‌లో కలిసి అర్జీ ఇచ్చింది. ఆమె కష్టాన్ని విన్న కలెక్టర్ చలించిపోయారు. బాధిత మహిళలకు న్యాయం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. వెంటనే జిల్లా పంచాయతీ శాఖ అధికారి కెఎల్.ప్రభాకర్‌రావును పిలిచి సమస్యను తెలుసుకున్నారు. మహిళకు న్యాయం చేయాలని డిపిఒనూ ఆదేశించారు. డిపిఒ ప్రభాకర్‌రావు సైతం సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించారు. సులోచన ఏ శాఖలో ఉద్యోగం ఇచ్చారు.? ఏ నిబంధనల మేరకు ఆమె పని చేసింది..? అన్న వివరాలపై ఆరా తీశారు. వేతనాలు చెల్లించడానికి వస్తున్న అడ్డంకులపై ట్రెజరీ అధికారులను సంప్రదించారు. కాగ సులోచన భర్త గుత్తి పంచాయతీగా ఉన్న సమయంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. సులోచనకు ఉద్యోగం వచ్చే సమయంలో గుత్తి మున్సిపాల్టీగా మారింది. దీంతో మహిళ పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగిగా రికార్డుల్లో ఉండడం.. నియామకం మున్సిపాల్టీలో ఉండడం వల్ల వేతనం అందకుండా పోయినట్లు డిపిఒ గుర్తించారు. నిబంధనల మేరకు పంచాయతీ రాజ్ శాఖ తరుపున సులోచనకు ఉద్యోగం కల్పించాల్సి ఉండగా, అప్పటి అధికారులు ఆమెకు మున్సిపాల్టీలో ఉద్యోగం ఇచ్చారు. ఈ రకంగా డిపిఒ మహిళకు జరిగిన ఇబ్బందిని గుర్తించారు. వెంటనే సమస్యను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్, ఆర్థిక శాఖతో పాటు ఇతర శాఖల ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఇలా బాధితురాలి సమస్య పరిష్కారానికి అనుబంధంగా ఉన్న అన్ని శాఖల అధికారులతోనూ డిపిఒ మాట్లాడారు. అన్ని రికార్డులను ఒకచోటకి చేర్చి సమస్య చిక్కుముడిని విప్పారు. ఈ వివరాలు అన్నింటినీ 11-06-2022న రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ పరిశీలించిన అధికారులు కూడా ఈ అంశంపై ప్రత్యేక చొరవ తీసుకున్నారు. 9-12-2022లోగా బాధిత మహిళకు వేతనం, పూర్తి స్థాయి ఉద్యోగం, పిఆర్‌సి, ఇతర అరియర్స్, జాబ్ సీనియారిటీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు సులోచనకు 10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయి రూ.27 లక్షలు ఆమె ఖాతాలోకి జమ చేశారు. ఉద్యోగాన్ని సైతం రెగ్యులరైజేషన్ చేసి ఆమె జీవితంలో వెలుగును నింపారు. ఓ మహిళ కష్టంపై సాటి మహిళగా కలెక్టర్ నాగలక్ష్మి స్పందించిన తీరు, జిల్లా పంచాయతీ శాఖ అధికారి కెఎల్.ప్రభాకర్‌రావు చూపిన చొరవపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. బాధితులకు సాయం చేసే ఇలాంటి అధికారులు ఎందరికో స్ఫూర్తిదాయకం అని కొనియాడారు.





వేమన ఇతి వృత్తాన్ని తెలియజేసేలా వినుర వేమ నాటకంలో ప్రదర్శనలు...



వినురవేమన నాటకాన్ని తిలకిస్తున్న విద్యార్థులు, ప్రజలు

తెలుగు వెలుగు.. మహాకవి వేమన..!

◆ ఆయన సాహిత్యంతో సమాజ జాగృతం ◆ ఆలోచింపజేసిన వేమన నాటకం

◆ ముగిసిన బహుజన సాంస్కృతిక ఉత్సవాలు ◆ ఉత్సవాలకు 'అనంత' నీరాజనం



ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

పదునైన సాహిత్యం... ప్రశ్నించే తత్వం.. జాతిని మేల్కొలిపే పదాలతో సమాజాన్ని జాగృతం చేసిన తెలుగు వెలుగు మహాకవి వేమన అని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని లలిత కళాపరిషత్‌లో ఐద్వా, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బహుజన సాంస్కృతిక ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆఖరి రోజు 'వినురవేమ' మహాకవి యోగి వేమన జీవిత చరిత్రపై నృత్య నాటక రూపకాన్ని అభ్యుదయ అకాడమీ వారు ప్రదర్శించారు. చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బాలరంగయ్య అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ హరిత రాజగోపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగురోజులు పాటు జరిగిన సాంస్కృతిక ఉత్సవాలకు ప్రజలు 'అనంత' నీరాజనం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్మన్ హరిత రాజగోపాల్ మాట్లాడుతూ సమాజంలోనున్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా అనేక మంది మమనీయులు ఎంతగానో కృషి చేసారని తెలిపారు. అందులో వేమన ఒకరు అన్నారు. అటువంటి మహనీయల జీవిత ఇతివృత్తాల ఆధారంగా నాటక రూపకాన్ని ప్రదర్శించి నేటి తరానికి తెలియజేసే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ వేమనయ రాయలసీమ గడ్డపై జన్మించి ప్రపంచ పుటల్లో చెరగని స్థానాన్ని పొందారని కొనియాడారు. సమాజంలో మూఢవిశ్వాసాలు, చాందసవాదం, కుల, మత, ధనిక అంతరాలపై తిరుగుబావుట సంధించిన తొలి విప్లవ కవి వేమన అన్నారు. వేమన పద్యరచన సరళి మూడు వాక్యాలతో సూటిగా, సమగ్రంగా ఉండటం, పండితులకే కాక పామరులకు సైతం అర్థమయ్యే జీవిత సత్యాలుగా వేమన పద్యాలు ప్రసిద్ధికెక్కాయని తెలిపారు. శతాబ్ధాల తరబడి ప్రజల నాలుకలపై వేమన పద్యం చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. సమాజంపై వేమన లేవనెత్తిన ప్రశ్నలు వందల సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ జావాబు దొరకనివిగానే ఉన్నాయంటే, వేమన ఎంతటి గొప్ప దార్శనికుడో అర్థం చేసుకోవచ్చు అన్నారు. అలాంటి మహనీయుల జీవిత చరిత్రను నేటి సమాజానికి తెలియజేడం అభినందనీయం అన్నారు.

నాటి స్మృతులు సాక్షాత్కారం...

వినురవేమ నాటక ప్రదర్శన నాటి పరిస్థితులు, స్మృతులను కళ్లకు కట్టినట్లు చూపింది అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు వేమన జీవిత చరిత్రను ఆద్యంతం అద్భుతంగా ప్రదర్శించారు. మానవుల విలాస, వ్యసనాలు, మూఢాచారాలు వెర్రితలలుగా జఠిలమై సమాజాన్ని పీడిస్తున్న సంఘటనలతో నృత రూపక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రజలు, విద్యార్థులు నాటకాన్ని ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఇలాంటి నాటకాలు నేటి సమాజానికి ఎంతో అవసరమంటూ పలువురు సాహితీవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, డాక్టర్ శంకరయ్య, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, ఐద్వా రాష్ట్ర నాయకులు సావిత్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల రాజేశ్వరీ, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఒ.నల్లప్ప, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్యచంద్ర, జిల్ల నాయకులు పరమేష్, సిఐటియు నాయకులు రామిరెడ్డి, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వస్తు సేవలపై అవగాహన అవసరం

అనంతపురం కలెక్టరేట్ : వినియోగదారులు వినియోగించే వస్తువులు వాటి సేవల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే నాణ్యత ప్రమాణాలను ప్రశ్నించగలుగుతామని వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షులు వై.మోహన్ అన్నారు. గురువారం ఆ సంస్థ ఆధ్వర్యంలో 24వ జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో వినియోగదారుల హక్కులు, న్యాయ పరిష్కారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం ఏ వస్తువులు కొన్నా, ఎలాంటి సేవలు ఉపయోగించుకున్నా ఖచ్చితంగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లు ఉంటే మనకు ఏదైనా నష్టం జరిగినప్పుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చు అన్నారు. వినియోగదారులు అతి తక్కువ ఫీజుతో త్వరితగతిన న్యాయం పొందవచ్చు అన్నారు. సిఆర్‌పిఒ సెక్రటరీ కెఎం.అసాదుల్లా మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసేటప్పుడే జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కల్తీలు, నకిలీలు పెరుగుతునన్న రోజుల్లో పలు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణస్వామి, జిల్లా పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు పెద్దన్న గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కృతజ్ఞతలు

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం నగరంలో నిర్వహించిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభలు జయప్రదం కావడానికి కృషిచేసిన వారందరికీ యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నగర వ్యాప్తంగా హార్ధిక, ఆర్థిక సహాయ సహకారాలు అందించిన ప్రజా ప్రతినిధులకు, ప్రజలకు, ఉద్యోగులకు, అధికారులకు, అనధికారులకు, ఉపాధ్యాయులకు, రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన ప్రతినిధులకు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులకు, కార్మికులకు, కళాకారులకు, పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా, నగరంలో నలుగురు సభ్యులకు రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

బయోమైనింగ్ త్వరగా పూర్తిచేయండి

నగర మేయర్ మొహమ్మద్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చేపడుతున్న బయో మైనింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగర మేయర్ మొహమ్మద్ వసీం అధికారులకు సూచించారు. గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డ్‌ను మేయర్ వసీం గురువారం పరిశీలించారు. బయోమైనింగ్ ఎంతవరకు వచ్చిందని అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం నగరానికి ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిగా ఉన్న డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రూ.24 కోట్ల నిధులను మంజూరు చేయించారన్నారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేయించే దిశగా చర్యలు చేపట్టి ఇప్పటికే 80 శాతం పైగా పూర్తి చేయించామన్నారు. మార్చి లోపు మిగిలిన లెగసి వేస్ట్‌ను బయోమైనింగ్ పూర్తి దిశగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.360 కోట్లతో 'జల్ జీవన్ మిషన్'.!

◆ 55 ఎల్‌పిసిడిలు ఇవ్వాలన్నది లక్ష్యం ◆ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకొచ్చేరా .?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



జల్ జీవన్ మిషన్ కింద అనంతపురం జిల్లాకు రూ.360 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ తాగునీటి పథకంకు ఈ నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఇంటికీ నీటి కుళాయి కనెక్షన్ ఉండాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టారు. ప్రస్తుతం జిల్లాలో 75 శాతం ఇళ్లకు నీటి కుళాయి కనెక్షన్ ఉన్నట్టు గ్రామీణ తాగునీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఎస్ఇ ఎహసాన్ బాషా తెలిపారు. 2024 నాటికి ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందివ్వాలన్నది లక్ష్యమని ఆయన చెప్పారు. ఇందుకోసం దశల వారీగా పనులు చేపట్టడం జరుగుతోందని ఆయన వివరించారు. కొత్తగా ఏర్పడిన అనంతపురం జిల్లా వరకే చూస్తే మొత్తం 575 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో 1068 ఆవాస ప్రాంతాలున్నాయి. 16.23 లక్షల జనాభా ఉంది. ఇందులో 4,26,438 లక్షల కుటుంబాలున్నాయి. ఇప్పటి వరకు 2,89,770 గృహాలకు నీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఈ ఏడాది 78,632 గృహాలకు కొత్తగా కనెక్షన్లు ఇవ్వలన్నది లక్ష్యమవగా 36 వేల వరకు ఇప్పటికిచ్చారు. దాదాపు 75 శాతం ఇళ్లకు నీటి సౌకర్యం కల్పించారు. తక్కిన ఇళ్లకు 2024 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం.

రూ.360 కోట్లు మంజూరు

ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇవ్వడం, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకుగానూ ఈ ఏడాది రూ.360 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో పాత పైపులైన్ల పునరుద్ధరణ పనులు కూడా సాగుతున్నాయి. ప్రధానంగా 30 ఏళ్ల క్రితం వేసిన ఎసి పైప్‌లైన్ కొన్ని చోట్ల దెబ్బతింటోంది. అదే విధంగా పంపింగ్ వద్ద మోటర్ల సామర్థ్యం తగ్గింది. వీటిని మార్పులు చేసే ప్రతిపాదనలను పెట్టారు. వీటితోపాటు కొత్తగా కక్కలపల్లి, ఆత్మకూరు తదితర ప్రాంతాలకు నీటిని అందించే పైపులైన్, శింగనమల నీటిని అందించే పైపులైన్ తదితర పనులను ప్రతిపాదించారు. ఇవన్నీ పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటిని చాలా వరకు ఇబ్బందుల్లేకుండా అందించేందుకు వీలుంటుందని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చెబుతున్నారు.

కాంట్రాక్టర్లే ముందుకొచ్చేరా.?

ప్రస్తుతం ఏదైనా పనులు చేయాలంటే కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. టెండర్లు పిలిస్తే ముందుకొచ్చేవారు లేక, రెండు, మూడు సార్లు పిలిచే పరిస్థితి ఉంటోంది. గతేడాది జల్‌జీవన్ మిషన్, ఇతర పనులకు సంబంధించి కూడా రూ.102 కోట్ల పనులకుగానూ 900పైచీలుకు పనులకు టెండర్లు పిలిస్తే ఇప్పటి వరకు 600 పనులు మాత్రమే పురోగతిలోనున్నాయి. తక్కిన వాటికి కాంట్రాక్టర్ల సమస్యలతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పుడు ఈ ఏడాది విడుదలైన రూ.360 కోట్ల పనులు ముందుకు సాగాలంటే కూడా పెద్ద సవాల్‌గానే మారే పరిస్థితులు నెలకొన్నాయి. మండలాల వారీగా చేపట్టే ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయోనన్న సందేహాలు నెలకొన్నాయి.

లక్ష్యానికి చేరుకుంటాం

ప్రభుత్వం పెట్టిన లక్ష్యానికి అనుగుణంగా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఎక్కడా ఆటంకాల్లేకుండా సాధ్యమైనంత త్వరగా పునులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే కార్యక్రమాన్ని కూడా అత్యంత ప్రాధాన్యతతోనే చేపడుతున్నాం.

ఎహెసాన్ బాషా ,
ఎస్ఇ ఆర్‌డబ్ల్యూఎస్.

ఇంజినీరింగ్ కళాశాలలు న్యాక్ అక్రిడేషన్ సాధించాలి

ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ కె.రామమోహన్‌రావు

ప్రజాశక్తి-అనంతపురం

రాబోయే రోజుల్లో ప్రతి ఇంజినీరింగ్ కళాశాల న్యాక్ అక్రిడేషన్ సాధించాలని ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య కె.రామమోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం అనంతపురం జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ సెమినార్ హాల్ నందు అనంతపురం జేఎన్టీయూ, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి అధ్వర్యంలో యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు న్యాక్ అక్రిడేషన్ ఎలా సాధించాలన్న అంశంపై చర్చా కార్యక్రమం ఐక్యూ సి డైరెక్టర్ ఆచార్య జివి.సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ రామమోహన్‌రావు, గౌరవ అతిథిగా ఉపకులపతి ఆచార్య రంగజనార్ధన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు కాలంలో అన్ని ఇంజినీరింగ్ కళాశాలలకు న్యాక్ అక్రిడేషన్ గుర్తింపు తప్పనిసరి అని తెలిపారు. న్యాక్ గుర్తింపు వల్ల కళాశాల నాణ్యత ప్రమాణాలను పెంపొందించుకోవచ్చునని తెలిపారు. కళాశాలల్లో విద్యార్థి యొక్క విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొనే విధంగా కళాశాలలు పని చేయాలన్నారు. జాతీయ విద్యా విధానం-2020 సంవత్సరంలో భాగంగా విద్యార్థులకు నిరంతర అభసనాన్ని అందించాలని తెలిపారు. ఇంజినీరింగ్ కళాశాలలు న్యాక్ తెచ్చుకోవడం కష్టతర మేమీ కాదన్నారు. విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించి, గొప్ప అవకాశాలు అందిపుచ్చుకొనే విధంగా తీర్చి దిద్దాలని సూచించారు. రెక్టార్ ఆచార్య విజయ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, వివిధ ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్, మేనేజ్ మెంట్ మెంబర్లు పాల్గొన్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురము జేఎన్టీయూ పరిధిలో నిర్వహించిన ఎంటెక్ ఫలితాలు గురువారం సాయంత్రం విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ.కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.టెక్ ఒకటవ సెమిస్టర్ (సప్లిమెంటరీ) రెండవ సెమిస్టర్ (రెగ్యులర్) (ఆర్ 21), ఎంటెక్ రెండవ మూడవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ, ఎంఎస్‌సి రెండవ, మూడవ సెమిస్టర్ (ఆర్ 20) సప్లిమెంటరీ, ఎంఎస్‌సి రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్, ఒకటవ సెమిస్టర్ (ఆర్ 21) సప్లిమెంటరీ, ఫార్మా-డి మొదటి రెండవ సంవత్సరం(ఆర్ 14) సప్లిమెంటరీ, ఫార్మా-డి రెండవ సంవత్సరం (ఆర్ 17)అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎం ఫార్మసీ మూడవ సెమిస్టర్ (ఆర్ 17) సప్లిమెంటరీ, ఫార్మా-డి మొదటి సంవత్సరం (ఆర్ 17) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు, కంట్రోలర్ డాక్టర్ బి.చంద్ర మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూలీల ఇంట విషాదం

◆ ఆటో ప్రమాదంలో ఒకరు మృతి.. పలువురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

కూలీల ఇంట విషాదం చోటు చేసుకుంది. పొట్టకూటి కోసం ఇతర గ్రామానికి వెళ్లిన కూలీలు ప్రమాదానికి గురయ్యారు. పనిముగించుకుని ఆటోలో వస్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళా కూలీ మృతి చెందింది. మరో పది మంది గాయపడ్డారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రం సమీపంలోని వెంకటాంపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని న్యామద్దల గ్రామానికి చెందిన 10 మంది కూలీలు వరినాట్లు వేసేందుకు గురువారం ఉదయం ఆటోలో ఒంటికొండ గ్రామానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని అదే ఆటోలో మధ్యాహ్నం స్వగ్రామానికి బయల్దేరారు. ఆటో మండల కేంద్రం సమీపంలోని బాట పోలేరమ్మ గుడి వద్దకు రాగానే వెనుకవైపు గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డుపక్కన ఉన్న గుంతలోకి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో న్యామద్దల గ్రామానికి చెందిన నాగేపల్లి అంజక్క(55) అక్కకడికక్కడే మతిచెందింది. ఆటోలో ఉన్న 10 మంది కూడా గాయపడ్డారు. వీరిలో వీరమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులు అందరూ అనంతపురం ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ.. బాధితులకు ఆర్థిక సాయం

ఆటో ప్రమాదం విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్పందించారు. చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను బాధితులతో అడిగి తెలుసుకన్నారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన కుటుంబానికి రూ.50వేలు, క్షతగాత్రులకు రూ.20వేల తక్షణ సాయాన్ని ఎమ్మెల్యే అందజేశారు. రోజు కూలి పనులు చేసుకునే కుటంబాలకు ఇలాంటి ఘటన జరగడం దురదష్టకరమని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

అనంతపురం : అంగన్వాడీ కేంద్రానికి వచ్చే విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని రుద్రంపేట గ్రామ సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ తెలిపారు. అర్బన్ ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయతీ, చంద్రబాబు నగర్ కొట్టాలలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యాబోధన, భోజనం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. అనంతరం పిల్లల తల్లులకు బాలామృతం, కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు అందజేశారు.



రాతి దూలం లాగుడుపోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

రాతి దూలం లాగుడు పోటీలు

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో యన్నం రాజారెడ్డి జ్ఞాపకార్థం గురువారం నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలను ముఖ్య అతిథి తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ పోటీలలో ఆత్మకూరు గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి బహుమతిని కైవశం చేసుకున్నారు. శ్రీనాథ శ్రీలతరెడ్డి చేతుల మీదుగా రూ.40 వేలు అందజేశారు. రెండవ బహుమతిని గెలుపొందిన కడప జిల్లా దేవగాని రామాంజనేయులుకు రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, పవన్‌రెడ్డి, బాలు, పోతన్న, ఆరోగ్యం రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

పుట్లూరు : మండలంలోని కుమ్మనమల, మడ్డిపల్లి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో యోగానందరెడ్డి గురువారం తనిఖీ చేశారు. బయోమెట్రిక్, రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, స్పందన కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని సూచించారు. ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చెన్నకేశవులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 వేలు ఆర్థిక సాయం

నార్పల : అనారోగ్యంతో బాధపడుతున్న నార్పల మండల కేంద్రంలోని ఉద్దిబావిచేను కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త చంద్రశేఖర్ వైద్య ఖర్చుల నిమిత్తం శింగనమల నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం డబ్బును చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. టిడిపి పార్లమెంట్ కార్యదర్శి మదమంచి ప్రతాప్ చౌదరి, జిల్లా రైతు అధికార ప్రతినిధి నడిమిదొడ్డి తిప్పన్న, నరసాపురం శివరామకృష్ణ, రాయవరం శ్రీరాములు, ఆకుల లక్ష్మీనారాయణ, పగడాల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు

వాలంటీర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

రాయదుర్గం : రాయదుర్గం పట్టణం 12వ సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ఒక వాలంటీర్ పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18-35 సంవత్సరాల మధ్య వయస్సు యువతీ యువకులు ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

23న వాహనాలకు వేలంపాట

ఉరవకొండ : ఉరవకొండ సెబ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలు చేస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 23వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం వేస్తున్నట్లు ఉరవకొండ సెబ్ ఇన్‌స్పెక్టర్ బి.మారుతీరావు తెలిపారు. గురువారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేలం పాటలలో పాల్గొనదలచిన వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో, రుద్రంపేట బైపాస్‌లోని శ్రీ చైతన్య పాఠశాల ఎటిపి-10 బ్రాంచ్ నందు, బస్టాండు సమీపంలోనిశ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో, హౌసింగ్ బోర్డ్‌లోని ఏటీపీ-8లో గణిత దినోత్సవ వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ భారతీయ గణిత చరిత్రకు వన్నె తెచ్చిన మేధావి శ్రీనివాస రామానుజన్ అన్నారు. ప్రపంచానికి అత్యుత్తమ గణిత సిద్ధాంత సూత్రాలను అందించిన శ్రీనివాస రామానుజన్ మన భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం అని కొనియాడారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను ఆసక్తిగా తిలకించారు. ప్రిన్సిపల్ తబస్సుమ్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ వంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, పూజ, డీన్‌లు రుషిబాల, అప్పలనాయుడు, ఏవో గోపాల్, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ పాల్గొన్నారు.

అనంతపురం : స్థానిక బచ్‌పన్ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చిన్నపిల్లల సర్జన్ డాక్టర్ హరిప్రసాద్, పాఠశాల ఫౌండర్ షాలీ హబీబ్ హాజరై రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చైర్మన్ దాదా గాంధీ, డైరెక్టర్ అన్వర్‌జాన్, ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవభారత్ పాఠశాలలో..

ఆజాద్‌నగర్‌లోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



నవభారత్ పాఠశాలలో బహుమతుల ప్రదానం

పాఠశాల కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాఠశాలలో విద్యార్థులు మ్యాథ్స్ క్లబ్‌గా ఏర్పడి చేపట్టిన గణిత గుర్తులు, ఆకారాల ఆకృతులు, చిన్నారుల వేషధారణలు, ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిట్టురు కృష్ణవేణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో...

స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి అధ్వర్యంలో మ్యాథ్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణిత ప్రదర్శనలు చెపట్టారు. ఉపాధ్యాయులు, ద్యార్థులు పాల్గొన్నారు.

తాడిపత్రి : తాడిపత్రి పట్టణం విజయనగర్ కాలనీలోని పద్మవాణి హైస్కూల్లో మాథ్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దారు మునివేలు, ఎంఇఒ నాగరాజు హాజరై శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం



శ్రీ చైతన్య పాఠశాలలో నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ అలీమ, హెడ్మాస్టర్ జయచంద్రారెడ్డి, ఎఒ మహబూబ్‌బాషా, గణిత ఉపాధ్యాయులు ఆంజనేయ ప్రసాద్, రాజ కుళ్లాయప్ప, లక్ష్మిదేవి, షానవాజ్, రాధ, హిమ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని నెహ్రూ యువ కేంద్రం డిడిఒ శ్రీనివాసులు తెలిపారు. శ్రీనివాస రామానుజం జయంతి సందర్భంగా అనూత నెట్ వర్క్స్ సౌజన్యంతో ఎన్‌కెసి సేవా సమితి ఆధ్వర్యంలో కురుగుంట కస్తూర్బా విద్యాలయం ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం స్టడీ మెటీయల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌కెసి సేవా సమితి వ్యవస్థాపకులు కమలనాథ్, కస్తూర్బా విద్యాలయం ఎస్ఒ నర్మద, తోట నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : చిన్నపప్పూరు గ్రామంలోని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ జీవితం, వ్యక్తిత్వం అను అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, హెచ్ఎం మల్లేశ్వరి, ఉపాధ్యాయులు గిరి, భాస్కర్, రామాంజినేయులు, బాలాజి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : స్థానిక కెవిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, మోపిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శేషగిరి ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు గణిత నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమిద్యాల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగ మంజుల, రాకెట్ల హెచ్ఎం సుంకన్న, కౌకుంట్ల హెచ్ఎం విజయ భారతి, గణిత ఉపాధ్యాయురాలు విజయ, సర్పంచి సిద్ధప్ప, పాఠశాల కమిటీ ఛైర్మన్ సతీష్, ఉప సర్పంచి లీలప్ప, ఎవిఆర్ పాఠశాల ప్రిన్సిపల్ విక్రమ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుట్లూరులో..



తాడిపత్రిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నేరాలు ఘోరాలు

వివాహ సంబంధం విషయంలో ఘర్షణ

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-యల్లనూరు

అమ్మాయి వివాహ సంబంధం విషయమై జరిగిన రెండు కుటుంబాల ఘర్షణలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన యల్లనూరు మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. యల్లనూరు మండల కేంద్రంలోని వెంకయ్య కాలువ రోడ్డు సమీపంలో ఉన్న బోయ సామాజిక వర్గానికి చెందిన గజ్జప్పగారి బాలరాజు, దాసప్పగారి నరసింహులు కుటుంబాల మధ్య అమ్మాయి వివాహ సంబంధం విషయమై ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు పరస్పరం రాళ్లతో దాడిచేసుకున్నారు. ఈ దాడుల్లో చాపల పెద్దయ్య, వెంకటనారాయణ, నరసింహులు గాయపడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రెండు కుటుంబాల వారిని విచారణ నిమిత్తం పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు రావాలని కబురంపారు. స్టేషన్‌కు బయలుదేరిన దాసప్పగారి నరసింహులు కుటుంబీకులపై చాపల పెద్దయ్య వర్గీయులు కర్రలతో దాడిచేశారు. ఈదాడిలో కుక్కల చంద్ర, నాగముని, ఆనంద్ గాయపడ్డారు. వారిని వైద్య చికిత్సల నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సిఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ట్రాక్టరు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..రంగచేడు గ్రామానికి చెందిన బాలకృష్ణకు చెందిన ట్రాక్టర్ వ్యవసాయ పనుల నిమిత్తతం బ్రహ్మసముద్రానికి వచ్చింది. స్థానిక అంగడి మురళి హోటల్ వద్ద ట్రాక్టరు ఆపి డ్రైవర్ టిఫిన్ తినేందుకు వెళ్లాడు. ట్రాక్టర్‌కు కీస్ అలాగే ఉంచి వెళ్లాడు. ఈ సమయంలో స్థానిక బోయ హనుమంతరాయుని కుమారుడు బోయ రమేష్ నిలిపివున్న ట్రాక్టర్‌ను ఎక్కి స్టార్ట్ చేశాడు. ఎక్సలేటర్ తొక్కడంతో ట్రాక్టర్ వేగంగా ముందుకు వెళ్లింది. అక్కడ బస్సుకోసం ఎదురుచూస్తున్న బుడిమేపల్లి గ్రామానికి చెందిన రహంతుల్లా (65) ఉప్పర రఘును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రహంతుల్లా అక్కడక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడ్డ ఉప్పర రఘును కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతునికి భార్య హుస్సేన్‌బీ, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గాది లింగప్ప గొప్ప వ్యక్తి : ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-గుంతకల్లు

మాజీ ఎమ్మెల్యే గాది లింగప్ప రాజకీయంగా ధీశాలి అని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా కొనియాడారు. గాది లింగప్ప 19వ వర్ధంతి కార్యక్రమం స్థానిక మార్కెట్టు యార్డులో ఆయన తనయుడు వైసిపి బిసిసెల్ రాష్ట్ర నాయకులు గాది లింగేశ్వరబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ తలారి రంగయ్య, జెడ్పి చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే వై.వెంకట్రామి రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా, ఎడిసిసి మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు హాజరయ్యారు. గాది లింగప్ప చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం దేశీయ ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. గాది లింగప్ప తదనంతరం ఆయన కుమార్తె నీలావతి తండ్రి బాటలో రాజకీయ ప్రవేశం చేసి ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేశారన్నారు. ఆయన తనయుడు చినబాబు రాజకీయాలలో నిలచి తండ్రి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గాది లింగప్ప కుటుంబ సభ్యులు, నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదు శాతం రిజర్వేషన్ అమలుచేయాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఆర్థికంగా వెనకబడిన వర్గాల్లోని పేదలకు కేంద్రం పది శాతం రిజర్వేషన్ కల్పించిందని, దాంట్లో కాపు, తెలగ, బలిజలకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాయలసీమ బలిజ మహా సంఘం అధ్యక్షులు పాముదాయి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో టౌన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, నాయకులు రమణ, ప్రసాద్ తదితర నాయకులు సమావేశం నిర్వహించారు. బలిజలకు ప్రత్యేకంగా ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేసుకోవచ్చని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి అదేశాలు జారీ చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో దీన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీలకే మద్దతు ఇస్తామని తెలియజేశారు.

గడప గడపకూ మన ప్రభుతం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ముచ్చుకోట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

మండలంలోని చిక్కేపల్లి గ్రామంలో గ్రామ సచివాలయాన్ని, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి మరొకసారి వైసిపి ప్రభుత్వానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ మెంబర్ రవిప్రసాద్ రెడ్డి, ఎంపిపి రామ్మూర్తిరెడ్డి ఉపాధ్యక్షులు బొందలదిన్నె రామయ్య, అమర్‌నాథ్‌రెడ్డి, అశ్వర్థ నారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, సర్పంచి భారతి, రాము, యోగేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూత నివ్వాలి

ఉరవకొండ : వికలాంగులకు చేయూతనిచ్చి, వారిపట్ల ప్రేమాభిమానం కలిగివుండాలని విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమ నిర్వాహకులు, విద్యావేత్త డి.ఎర్రిస్వామి అన్నారు. గురువారం ఉరవకొండ పట్టణంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని చైతన్య దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొన్న వికలాంగులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక గవిమఠం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎర్రిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వాలు వికలాంగులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు కల్పించాలన్నారు. వారి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. వికలాంగులలో దాగివున్న నైపుణ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య సేవా సంఘం అధ్యక్షులు వడ్డే నాగేంద్ర, ఉపాధ్యక్షులు చోటావలి, కార్యదర్శి వడ్డే శివరుద్ర, సహాయ కార్యదర్శి మీనుగ మోహన్‌బాబు, కోశాధికారి ఆర్‌కెటి జలాన్, సంఘం సభ్యులు హమీద్ రషీద్, వడ్ల వలి, పట్టు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించం

ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు పేర్కొన్నారు. గురువారం విడపనకల్లు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలను సమన్వయం చేసుకొని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కొత్తకోట, విడపనకల్ గ్రామాల్లో తాగునీటి ఆర్ఒ ప్లాంట్‌లు మూతపడ్డాయని వాటిని పంచాయతీలకు అప్పజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బ్రహ్మయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లాలో సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా జేఏసీ ఛైర్మన్ కె.విజయ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో సమగ్ర శిక్షలో కెజిబివిలలో టీచింగ్, నాన్ టీచింగ్, ఎంఆర్‌సి సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఎస్ కోఆర్డినేటర్లు, మండల్ లెవెల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, సైట్ ఇంజనీర్లు, భవిత సెంటర్ అయాలు, ఐఈఆర్టీలు, సీఆర్పీలు, పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు, జిల్లా డిపిఒ ఆఫీస్ సిబ్బంది ఇలా దాదాపుగా 2500 మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైం పద్ధతిలో పనిచేస్తున్నారన్నారు. వీరందరికీ నవంబర్ నెల వేతనాలు అందలేదన్నారు. ఇప్పటికే డిసెంబర్ 22వ తేదీ కూడా అయిపోయిందన్నారు. ఇంతవరకు వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు అందిస్తామని, వారిని రెగ్యులరైజ్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కనీసం జీతం కూడా ఇవ్వడం లేదన్నారు. రెండు రోజుల్లో క్రిస్టమస్, ఆ తర్వాత నూతన సంవత్సరం పండుగలు ఉన్నాయన్నారు. జీతాలు అందకపోతే పండగ పూట చిరుద్యోగులు పస్తులు ఉండాల్సి వస్తుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెల నెలా వేతనాలు, ఫెస్టివల్ అలవెన్సులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగులతో కలిసి జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

మతాలు కాదు..మానవత్వం ముఖ్యం

ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి

ప్రజాశక్తి-కణేకల్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

వ ం న ం ష ం ల ం ద ర ూ ఒక్కటేనని, మతాలు కాదు.. మానవత్వం ముఖ్యమని ఎమ్మెల్సీ వై.శివరాంరెడ్డి పేర్కొన్నారు. కణేకల్లు మండల కేంద్రంలోని కెసిఎన్ఆర్ కళ్యాణమండపంలో గౌసేపాక్ సంధాని సాహెబ్ ఆధ్వర్యంలో సర్వధర్మ సమ్మేళన మహాసభ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, కాపు అలైఖ్య, సిద్ధకోట మంజునాథ, ఖాజీ సైఫుల్లా, అనంతకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కనేకల్లు ప్రాంతంలో కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా చేపట్టిన ఈ మహాసభకు వేలాదిమంది ప్రజలు తరలిరావడం సంతోషదాయకమన్నారు. భారతదేశమంతటా ఇలాంటి వాతావరణమే చోటుచేసుకుంటే ఎవ్వరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. మనుషులంతా ఒక్కటే అన్న నినాదంతో చేపట్టిన ఈ మహాసభ జయప్రదం వెనుక ఎంతోమంది మేధావుల కృషి ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఇంట్లో ప్రతి చిన్నారికీ మానవత్వం గురించి నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి, తిమ్మప్ప, కేశవరెడ్డి, నాగిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వేలూరు మరియప్ప, మహబూబ్‌పీరా, నబీసా, శర్మాస్, అల్లాబకాష్, పద్మావతి, ఉషారాణి, ఆనంద్‌రాజ్, లాలప్ప, చంద్ర, మారన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం

ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పద్మావతి, పెద్దారెడ్డి



పెద్దపప్పూరులో ట్యాబ్‌లతో విద్యార్థులు

ప్రజాశక్తి-గార్లదిన్నె

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తోపాటు రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సలహాదారుడు ఆలూరు సాంబశివరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో బోధన ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టేలా సీఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు స్కూలు యూనిఫాం మొదలుకొని ట్యాబ్‌ల దాకా అన్నీ ఉచితంగా అందిస్తూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా రంగంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి, జడ్పిటిసి సంధ్యారాణి, మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ముచ్చుకోట గ్రామంలోని 8వ తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేతుల మీదుగా బైజూస్ ట్యాబ్‌లు గురువారం పంపిణీ చేశారు. పిల్లలకు సులభతరంగా విద్యను అందించడంలో ట్యాబ్‌లు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే పెద్దారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, జాతీయ ఉపాధి హామీ పథకం మెంబర్ వేమనాథరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుంతకల్లు

పేదలకు ఇళ్ల స్థలాలు, ఇల్లు నిర్మించి ఇవ్వాలన్న డిమాండ్‌తో ఈ నెల 27 నుండి 29వ తేది వరకు గుత్తి నుండి అనంతపురం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక హంపిరెడ్డి భవానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత రెండేళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు కాకుండా జగనన్న కాలనీల ఊళ్లను నిర్మించి ఇస్తామని గొప్పలు చెబుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తే వాటిని బలవంతంగా లాక్కుని సిఎం జగన్మోహన్ రెడ్డి ఒక సెంటు స్థలం ఇవ్వడం సరైంది కాదన్నారు. పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ లక్ష్య సాధనకు కోసం అనంతపురంకు పాదయాత్ర చేపట్టామన్నారు. అనంతరం 29వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు మారుతిప్రసాద్, బి.తిమ్మప్ప, నాయకులు షబ్బీర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 27 నుండి 29వ తేది వరకు గుత్తి నుండి అనంతపురం వరకు జరిగే పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం శింగనమల మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గుత్తి నుండి అనంతపురం కలెక్టర్ ఆఫీసు వరకు చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, వెంకటస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ముగ్గులు, క్రీడాపోటీలు

రాయదుర్గం : సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా ఛైర్మన్ కాపు భారతి ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ముగ్గులు, కబడ్డీ, కోకో, మ్యూజికల్ ఛైర్స్, షాట్‌పుట్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ పోటీలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విజేతలను విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రకటించారు. జగన్ జన్మదిన వేడుకల్లో భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేసిన వారందరికీ విప్ కాపు దంపతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో నిర్వహించనున్న ఆర్‌వైఎస్ఎల్ క్రికెట్ టోర్నీని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, గుమ్మగట్ట మండల కన్వీనర్ మంజునాథ, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, లావణ్య, నాగవేణి, షబ్బీర్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.